కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

శ్రీ షష్ఠీ దేవి స్తోత్రమ్ - భావార్థముతో.



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

Kiron Type Institute

షష్ఠీదేవి

" నా అనుగ్రహం పొందిన బిడ్డలు దీర్ఘాయుష్కులై ఆరోగ్య, భోగభాగ్యాలతో వర్ధిల్లుతారు" అని తెలిపింది షష్ఠీదేవి.

షష్ఠీదేవి స్తుతి

శ్లో॥ నమో దేవ్యై మహాదేవ్యై సిద్ధ్యై శాంత్యై నమో నమః।
శుభాయై దేవసేనాయై షష్ఠ్యై దేవ్యై నమో నమః॥
వరదాయై పుత్రదాయై ధనదాయై నమో నమః।
సుఖదాయై మోక్షదాయై షష్ఠ్యై దేవ్యై నమో నమః॥

శ్లో॥ సృష్ట్యై షష్ఠాంశరూపాయై సిద్ధాయై చ నమో నమః।
మాయాయై సిద్ధయోగిన్యై షష్ఠీ దేవ్యై నమో నమః॥
సారాయై శారదాయై చ పరా దేవ్యై నమో నమః।
బాలాధిష్ఠాతృ దేవ్యై చ షష్ఠీ దేవ్యై నమో నమః॥

శ్లో॥ కల్యాణ దేవ్యై కల్యాణ్యై ఫలదాయై చ కర్మణాం।
ప్రత్యక్షా యై సర్వ భక్తానాం షష్ఠ్యై దేవ్యై నమో నమః॥
పూజ్యాయై స్కంద కాంతాయై సర్వేషాం సర్వకర్మసు
దేవ రక్షణ కారిణ్యై షష్ఠీ దేవ్యై నమో నమః॥

శ్లో॥ శుద్ధ సత్త్వ స్వరూపాయై వందితాయై నృణాం సదా
హింసాక్రోధవర్జితాయై షష్ఠీ దేవ్యై నమో నమః॥
ధనం దేహి ప్రియం దేహి పుత్రం దేహి సురేశ్వరి!
మానం దేహి జయం దేహి ద్విషోజహి మహేశ్వరి!

శ్లో॥ ధర్మం దేహి యశో దేహి షష్ఠీదేవీ! నమో నమః।
దేహి భూమిం ప్రజాం దేహి విద్యాం దేహి! సుపూజితే॥
కల్యాణం చ జయందేహి విద్యాదేవి! నమో నమః।
నమోస్తుతే నమోస్తుతే షష్ఠీదేవి నమో నమః॥

– – – = – – –

పురిటి ఇంట షష్ఠీదేవి స్తోత్రమును పఠించిన శిశువుకు సర్వగ్రహ పీడా, పాప బాధలూ నివారణ అవుతాయి. పసిబిడ్డ అకారణంగా ఏడుస్తున్నప్పుడు ఈ స్తోత్రమును వారి వద్ద పఠించిన బాధా నివృత్తి అవుతుంది. సంతానం లేనివారు షష్ఠీదేవిని వ్రత విధానమున పూజించిన వారికి సంతానం కలుగుతుంది.

- - - = - - -

పార్వతీ పరమేశ్వరుల పుత్రుడైన షణ్ముఖుడు, తారకాసురుని వధించి లోకశాంతి ప్రసాదించాడు.

అప్పుడు దేవతలూ, మహర్షులూ ఆ ఆది దంపతులను వేనోళ్ళ స్తుతించి, "అమ్మా! జగదీశ్వరీ! మీరు శక్తి స్వరూపులు కాబట్టి షణ్ముఖుని కుమారునిగా బడసినారు. కానీ మావంటి వారి గతి ఏమిటి? మాకు సలక్షణమైన సంతానమును ప్రసాదించి ఆ సంతానమును చల్లగా కాపాడ డానికి అనుగ్రహ దేవత లేదు కదా, అట్టి దేవతను మీ వరప్రసాదంగా ముల్లోకాలకు అనుగ్రహించరాదా?" అని ప్రార్థించారు.

వారి ప్రార్థనలను మన్నించిన పార్వతీదేవి, "వత్సలారా! నా ప్రతిరూపమైన ప్రకృతి వలన యీ సృష్టి ఉత్పన్నమవుతోంది. ఆ ప్రకృతి వలన పుట్టిన యీ సృష్టి సంతతిని కాపాడడానికి ఆ ప్రకృతి యొక్క షష్ఠాంశ, అనగా ఆరవ కళ దివ్యరూపంతో అవతరించి షష్ఠీదేవి అనే నామంతో విరాజిల్లుతూ, శిశువులను రక్షిస్తూ, వారి బాలారిష్ట దోషాలను నివారిస్తూ వారిని సదా కాపాడుతూ ఉంటుంది. సంతానానికి పరదైవతయై విరాజిల్లుతూ, దేవసేన అనే పేరుతో మా షణ్ముఖుని వివాహమాడి అతనికి అర్ధాంగి కాగలదు. ఈ పరదేవతను పూజించినవారి సంతతి వృద్ధి చెందుతుంది" అని వరమిచ్చి ఆశీర్వదించింది.

ఆ వర ప్రభావం వల్ల ప్రకృతిమాత షష్ఠాంశ ఒక దివ్య సుందరిగా అవతరించి, గణపతులలో ఒకడైన ధర్మవర్ణి ఇంట దేవసేన అనే పేరుతో పెరిగి, షణ్ముఖునికి ఇల్లాలైంది.

షణ్ముఖుని వివాహంతో పాటు గణాధిపతి అయిన మహాగణపతికి కూడా వివాహం జరిపించిన పార్వతీ పరమేశ్వరులు విఘ్నాలకు అధిపతిగా ఆ మహాగణపతిని, దేవ సైన్యాధిపతిగా షణ్ముఖుని నియమించి లోకాలకు ఆనందం కలిగించారు.

ఇది ఇలా ఉండగా, స్వాయంభువ మనువు కుమారుడు ప్రియవ్రతుడు సంసారబంధం మోక్షమునకు ఆటంక కారణమని భావించి వివాహ విముఖుడై తపస్సు ఆరంభించాడు. అప్పుడు బ్రహ్మ అతనికి ప్రత్యక్షమై –

"నాయనా! మను వంశమును అభివృద్ధి చేయదలచి, నేను నీ వంశమునకు మనువును ప్రసాదించాను. కానీ నీవు వివాహ బంధం దుఃఖ కారణమని భావించి విరాగివైతే, మానవజాతి ఎలా వృద్ధి చెందుతుంది? అదీ గాక రాజు అయిన వాడు రాజ్యమును పాలించి, వివాహమాడి, సుపుత్రుని కని అతనికి రాజ్యపాలన అప్పగించిన అనంతరం తపోవనానికేగడం రాజధర్మం. మానవ ధర్మం కూడా అదే! నీవు ధర్మమునకు విరుద్ధంగా ప్రవర్తించరాదు. కనుక తపస్సు చాలించి, వివాహమాడి, యోగ్యుడైన కుమారుని కని ఆ తదనంతరం నీ జీవితేచ్ఛ నెరవేర్చుకో" అని హితబోధ చేశాడు. అప్పుడు ప్రియవ్రతుడు తపస్సు చాలించి రాజ్యానికి తిరిగి వచ్చి సుగుణశీలి అయిన కన్యను వివాహమాడి సంసార సుఖాలు అనుభవించాడు.

ప్రియవ్రతుని భార్యకి ఎంత కాలానికి గర్భం కలుగలేదు. అప్పుడు కశ్యప ప్రజాపతి వారిచేత పుత్రకామేష్టి యాగం జరిపించాడు. ఆ యాగాన్నమును భుజించిన కొంత కాలానికి రాణి గర్భవతి అయింది. ఆమె గర్భం పదినెలలు నిండినా ప్రసవం కలుగలేదు. రాణి ఆ గర్భ భారమును భరించలేక, ఒకనాడు తన పిడికిళ్ళతో గర్భమును బాదుకొనగా ఆమెకు ప్రసవ వేదన ఆరంభమై చివరికి ఒక మృత శిశివును కన్నది.

ఆ శిశువు మన్మథుని మించిన అందచందములు కలిగి ఉన్నాడు. కానీ మృత శిశువు. ప్రియవ్రతుడు ఆ మృత శిశువును చూస్తూ చాలాసేపు విలపించి చివరికి గుండెరాయి చేసుకొని, ఆ శిశువును భుజాన వేసుకుని స్మశానానికి చేరాడు. అక్కడ శిశివును నేలపై పరుండబెట్టి అంతిమ సంస్కారాన్ని జరపడానికి మనస్సు అంగీకరించక చాలా సేపు రోదించాడు.

అతని రోదన క్రమంగా దైవనిందా స్థాయికి చేరింది.

"ఓ బ్రహ్మదేవా! నేను వద్దు వద్దంటున్నా వినకుండా నన్నీ సంసారకూపంలోకి బలవంతంగా నెట్టావు. నాకీ దుఃఖం కలిగించడానికేనా? అమ్మా జగన్మాతా!

తల్లులను గన్న తల్లీ! నీ పాద పద్మాలను ఆశ్రయించాలని తపస్సు ఆరంభించిన నన్ను యీ భవ బంధాల్లో ఎందుకు బంధించావు? నేను ఏమి పాపం చేశాను? అయ్యో! నా మొర నాలకించే దయామయులు ఒక్కరూ లేరా? నాకు పుత్రభిక్ష పెట్టే పుణ్యాత్ములు లేనే లేరా? అంటూ వాపోయాడు.

అతని మొరలాలకించినట్లుగా ఒక దివ్య రూపంతో ఇక దివ్య విమానం వచ్చి అక్కడ ఆగింది. అందులో ఉన్న దేవతామూర్తిని షష్ఠీదేవిగా గుర్తించిన ప్రియవ్రతుడు చేతులు జోడించి ఆమెకి నమస్కరించాడు.

“తల్లీ! నువ్వు శిశురక్షకివని పరమేశ్వరి చెప్పింది. శిశు బాలారిష్టాలను బాపు అధిదేవతవని ఆ తల్లి వరమిచ్చింది. నిన్ను పూజించిన వారికి వంశాభివృద్ధి అవుతుందని ఆ జగన్మాత వాక్కు. మరి నాకు ఈ దుర్గతి ఏమిటి తల్లీ? నేనేం అపరాధం చేశాను. నాకు ఈ మృత శిశువును ఎందుకు ప్రసాదించావు?” అని వాపోయాడు ప్రియవ్రతుడు.

షష్ఠీదేవి మందహాసం చేసి “నాయనా! నీవు సంతానం కోసం పుత్రకామేష్ఠి చేశావు గానీ, సంతతికి అధిదేవత అయిన నాకు ఆ యామునందు ఆవాహన, స్థాన, ఆసన నివాసాలు కల్పించలేదు. యజ్ఞపురుషుడినీ, దిక్పాలకులనూ ఆవాహన చేసిన నీవు కనీసం నా పేరు కూడా తలచలేదు. మరి నీ శిశురక్షణకి నేఎలా బాధ్యత వహిస్తాను?” అని ప్రశ్నించింది. ప్రియవ్రతుడు తన పొరపాటు గ్రహించి “అమ్మా షష్ఠీదేవి! నా అపరాధానికి నన్ను క్షమించు. ఇప్పుడే, ఇక్కడే నిన్ను పూజిస్తాను. నీ వ్రతవిధానం చెప్పు” అని ప్రార్థించాడు.

వ్రత విధానం:

“నాయనా! ప్రకృతి పరదేవతా అవతారమైన నన్ను, ఆ ప్రకృతి లోంచి పుట్టిన మర్రి వృక్షము మొదలు యందు గానీ, మట్టితో నిర్మించిన గోడపైన గానీ, లేదా మట్టికి ప్రతిరూపమైన సాలగ్రామంపై గానీ నా ప్రతిమను ఉంచి పూజించిన వారి యెడల నేను ప్రసన్నురాలినై వారి అభీష్టాలు తీరుస్తాను. వారికి సత్సంతానాన్ని అనుగ్రహిస్తాను. నా అనుగ్రహం పొందిన బిడ్డలు దీర్ఘాయుష్మలై ఆరోగ్య భోగభాగ్యాలతో వర్ధిల్లుతారు” అని తెలిపింది షష్ఠీదేవి.

ప్రియవ్రతుడు సంతోషించి తక్షణమే తన భార్యను అక్కడికి రావించి అక్కడే ఒక మర్రివృక్ష మూలంలో షష్ఠీదేవి ప్రతిమను స్థాపించి వేదమంత్రయుక్త సహితంగా ఆ దేవిని పూజించాడు.

అప్పుడు షష్ఠీదేవి సంతుష్టురాలై తన అనుగ్రహ వీక్షణంతో ఆ మృత శిశువునకు ప్రాణం పోసింది.

ఆ శిశువునకు "సువ్రతుడు" అని తానే నామకరణం చేసి ఆ బాలుని ఆ దంపతులకు అప్పగించింది. అప్పుడు ప్రియవ్రతుడు, షష్ఠీదేవిని స్తుతించాడు.

ఈ స్తుతులకు సంతృప్తి చెందిన షష్ఠీదేవి "ప్రియవ్రతా! నీ భక్తికి సంతసించాను. నీ కుమారుడు సువ్రతుడు అప్రమేయ బలపరాక్రమ సంపన్నుడై ఈ ధరాతలమును పాలిస్తాడు. నీవు లోకహితము కోరి నాయీ షష్ఠీవ్రతమును లోక ప్రచారం గావించి ధన్యుడివి కావాలయ్యా" అని ఆశీర్వదించి అదృశ్యురాలయ్యింది.

నారద మహర్షి ఈ వృత్తాంతమును సావిత్రీ సత్యవంతులకు తెలిపి వారితో పాటు సావిత్రి జనకుల చేత కూడా షష్ఠీవ్రతమును జరిపించాడు.

ఆ వ్రత ఫలముచేత అశ్వపతి మహారాజుకి నూరుగురు కుమారులు జన్మించి వారి వంశ ప్రతిష్ఠను ఇనుమడింప చేశారు.

సావిత్రీ సత్యవంతులు సుపుత్రులను, రాజ్య వైభవమును పొంది జనరంజకంగా పాలన చేస్తూ, దాన ధర్మాది కార్యాలు చేసి అఖండ కీర్తి ప్రతిష్ఠలనార్జించారు. ఆ తదనంతరం సావిత్రి సుమంగళిగా తనువు చాలించి పుణ్యలోకాలకు తరలివెళ్ళింది.

అనంతరం సత్యవంతుడు కూడా ఆమెను అనుసరించి సద్గతులను పొందాడు. ఈ 'సతీ సావిత్రీ చరితము' విన్నవారు, చదివినవారు పావనులై ఇహపర సుఖాలను పొందగలరు.

ఈ షష్ఠీదేవిని సంకల్పయుక్త విధానంగా పూజించినవారు, సంతానాన్ని, సంతానాభివృద్ధిని పొందగలరు. వారి సంతానాలకు బాలారిష్ట దోషాలు తొలగి పోతాయి.

పురిటి ఇంట షష్ఠీదేవి స్తోత్రమును పఠించిన శిశువుకు సర్వగ్రహ పీడా, పాప బాధలూ నివారణ అవుతాయి. పసిబిడ్డ ఆకారణంగా ఏడుస్తున్నప్పుడు ఈ స్తోత్రమును వారి వద్ద పఠించిన బాధా నివృత్తి అవుతుంది. సంతానం లేనివారు షష్ఠీదేవిని వ్రతవిధానమున పూజించిన వారికి సంతానం కలుగుతుంది.

సావిత్రిగా జన్మించి గాయత్రి, షష్ఠీదేవిగా అవతరించిన ప్రకృతి మాతలు ఆ జగన్మాత అంశలేనని గ్రహించి ఆ జగదీశ్వరిని మనసా వాచా కర్మణా నమ్మి ఆరాధించిన వారికి సర్వ శుభములు కలుగుతాయి.

మార్గశిర శుద్ధ షష్ఠినాడు 'షష్ఠీ వ్రతము' ప్రారంభించి ప్రతి నెలలోనూ వచ్చే శుద్ధ షష్ఠినాడు ఈ వ్రతమును సంవత్సరకాలం చేసినచో సత్పురుష సంతానం కలుగునని షష్ఠీదేవి చెప్పింది.

శ్రీ వల్లీ దేవసేన సమేతంగా శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారిని ఆరాధించిన వారికి అన్ని విధాలా మేలు జరుగుతుంది. "స్వామి ఉపాసన సంజీవనిలా పనిచేస్తుంది"

జాతక సంబంధంగా కుజుడు ఇక్కట్లకు గురిచేసే సందర్భాల్లో సుబ్రహ్మణ్యారాధన ఆ ఇక్కట్లను పటాపంచలు చేస్తుంది. కుజుని అధిష్ఠాన దేవత ఈ స్వామియే.

ముఖ్యంగా భార్యాభర్తల మధ్య అపోహలు, ఎడబాట్లు, సంతాన లేమి వగైరాలు అగచాట్లను ఎదుర్కొంటున్న వారికి సుబ్రహ్మణ్య ఆరాధన ఇంద్రుని చేతిలోని వజ్రాయుధంలా పనిచేస్తుంది. అంతేకాక, కుమారస్వామిని పూజిస్తే సర్వదేవతలను పూజించినట్లే.

స్కాందపురాణంలో పరమ పురుషులైన శివుడు, విష్ణువు అవ్యక్త శక్తియైన ఉమ, లక్ష్మి వీరి సమైక్య, సమన్వయ తత్త్వమే కుమారస్వామి – అని చెప్పబడింది.

కనుక ఆ స్వామిని అర్చిస్తే శివశక్తులను, లక్ష్మీనారాయణులను కలిపి అర్చించిన ఫలం కలుగుతుంది.

"ప్రకృతి పురుషుల ఏకత్వం శ్రీ కుమారస్వామి తత్త్వం"

– – – || – – –

శ్రీ సుబ్రహ్మణ్య వైవృత్త పురాణే, శ్రీ ప్రియావృత రచిత

శ్రీ షష్ఠీ దేవి స్తోత్రమ్ - భావార్థముతో.

ధ్యానమ్:

01. శ్రీమన్మాతర మంబికాం విధిమనోజాతాం సదాభీష్టదామ్
స్కందేష్టాం చ జగత్ప్రసూం విజయదాం
సత్పుత్ర సౌభాగ్యదామ్।
సద్రత్నా భరణాన్వితాం సకరుణాం శుభ్రాం
శుభాం సుప్రభామ్
షష్ఠాంశాం ప్రకృతేః పరం భగవతీం శ్రీ దేవసేనాం భజే॥

శ్రీమాత, అంబికా, సకల అభీష్ట ప్రదాయిని, స్కందునికి ప్రియమైనది, జగత్తుకు కన్నతల్లి, సత్సంతాన భాగ్యమును ప్రసాదించునది, సర్వాలంకృత భూషితురాలు, కరుణా మూర్తి, శుభ ప్రదాయిని, ఆరు స్వరూపములు కలిగి, ప్రకృతి స్వరూపిణియైన భగవతి శ్రీ దేవసేనా మాతను మనసారా ప్రార్థిస్తున్నాను.

02. షష్ఠాంశాం ప్రకృతేః శుద్ధాం సుప్రతిష్ఠాం చ సువ్రతామ్
సుపుత్రదాం చ శుభదాం దయారూపాం జగత్ప్రసూమ్॥
శ్వేతచంపక వర్ణాభాం రక్తభూషణ భూషితామ్
పవిత్రరూపాం పరమం దేవసేనా పరాం భజే॥

తెలుపు బంగారు వర్ణ మిశ్రితమయిన చంపక పుష్పము యొక్క వర్ణము కలిగి, వజ్ర రత్న ఖచితములైన వస్త్రములను ధరించి, పవిత్రురాలై ఈ విశ్వమంతటా తన కరుణను ప్రసరిస్తూ, సంతాన భాగ్యాన్ని అనుగ్రహించే శ్రీ దేవసేనా మాతను మనసారా ప్రార్థిస్తున్నాను.

స్తోత్రమ్:

01. నమో దేవ్యై మహా దేవ్యై సిద్ధ్యై శాంత్యై నమో నమః।
శుభాయే దేవసేనాయై షష్ఠీ దేవ్యై నమో నమః॥

అద్భుతమైన పవిత్ర శక్తులను, శాంతిని ప్రసాదిస్తూ, దేవసేన, షష్ఠీదేవి నామాలతో పూజింపబడే జగజ్జననికి ప్రార్థన నమస్కారాలను సమర్పిస్తున్నాను.

01. దేవికి నమస్కారము. మహాదేవికి నమస్కారము. భగవతీ సిద్ధికి, శాంతికి నమస్కారము. శుభా! దేవసేనా! షష్ఠి దేవీ నీ కనేకనేకనమస్కారములు.

02. వరదాయై పుత్రదాయై ధనదాయై నమో నమః।
సుఖదాయై మోక్షదాయై చ షష్ఠీ దేవ్యై నమో నమః॥

అనేక వరములను, సంతాన సౌభాగ్యాన్ని పరమైశ్వర్యాన్ని, ఆనందాన్ని, ముక్తిని ప్రసాదించే షష్ఠీదేవికి నమస్కృతులు.

02. వరదాయిని, పుత్రదాయిని, ధన ప్రదాయిని, సుఖదాయిని, మోక్షదాయిని, భగవతీ షష్ఠి దేవీ నీ కనేకనేక ప్రణామములు.

03. సృష్ట్యై షష్ఠాంశరూపాయై సిద్ధాయై చ నమో నమః।
మాయాయై సిద్ధ యోగిన్యై షష్ఠీ దేవ్యై నమో నమః॥

ఈ ప్రపంచమును సృష్టించి, ఆరు స్వరూపములతో, అతీంద్రియ శక్తులు కలిగిన మాయా స్వరూపిణి, మహా యోగిని అయిన శ్రీ షష్ఠీదేవికి నమస్కృతులు.

04. సారాయై శారదాయై చ పరాదేవ్యై నమో నమః।
బాలాదిష్ఠాతృ దేవ్యై చ షష్ఠీ దేవ్యై నమో నమః

ఈ విశ్వములోని సమస్త పదార్థముల సారాంశమై, సరస్వతీ స్వరూపమై, సంతానమును ప్రసాదించే శ్రీ షష్ఠీదేవికి నమస్కృతులు.

03,04. ఆదిశక్తి ఆరవ అంశ నుండి ఉద్భవించిన సిద్ధికి నమస్కారము. మాయ, సిద్ధయోగిని, సార, శారద, పరాదేవి అను నామములో శోభించు షష్ఠీ దేవికి, బాలలకు అధిష్ఠాత్రి అయిన షష్ఠీ దేవికి నమస్కారములు.

05. కళ్యాణదాయై కళ్యాణ్యై ఫలదాయై చ కర్మణామ్।
ప్రత్యక్షాయై సర్వభక్తానాం షష్ఠీ దేవ్యై నమో నమః॥

పవిత్రురాలై, మంగళకరమైన కార్యములను నిర్వహించునదై, భక్తులకు ఇష్టార్థ కామములను ప్రసాదించునదైన శ్రీ షష్ఠీదేవికి నమస్కృతులు.

05. కళ్యాణ ప్రదాయిని, కల్యాణ రూపిణీ, కర్మఫల ప్రదాయిని, భక్తులకు ప్రత్యక్షంగా దర్శనం ఇచ్చే షష్ఠీ దేవికి అనేకానేక నమస్కారములు.

06. పూజ్యాయై స్కందకాంతాయై సర్వేషాం సర్వకర్మసు।
దేవరక్షణకారిణ్యై షష్ఠీ దేవ్యై నమో నమః॥

పూజనీయురాలై, సుబ్రహ్మణ్యుని దేవేరియై, సకల జనులు వారి కార్యములు నిర్వహించుటలో సహకరించునదై, దేవతలను సైతం రక్షించే శ్రీ షష్ఠీదేవికి నమస్కృతులు.

06. సర్వ కర్మలందు పూజ్యురాలు, స్కందుని కాంతామణి దేవ రక్షణ కారిణి అగు షష్ఠీ దేవికి నమస్కారములు.

07. శుద్ధసత్త్వ స్వరూపాయై వందితాయై నృణాం సదా।
హింసా క్రోధ వర్జితాయై షష్ఠీ దేవ్యై నమో నమః॥

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

సాత్విక స్వరూపిణియై, జీవులందరినీ కరుణించునదై, క్రూరత్వమును, కోపమును పారద్రోలునదైన శ్రీ షష్ఠీదేవికి నమస్కృతులు.

07. మానవులు ఏ దేవికి సదా వందనములు అర్పింతురో ఆ శుద్ధ సత్వ స్వరూపిణీ, హింసాక్రోధ రహితురాలు అగు షష్ఠీ దేవికి నమస్కారములు.

08. ధనం దేహి ప్రియాం దేహి పుత్రం దేహి సురేశ్వరి।
ధర్మం దేహి యశో దేహి షష్ఠీ దేవ్యై నమో నమః॥
మానందేహి జయందేహి దిషోజహి మహేశ్వరి।

నాకు ధనమును, ఇతరుల పట్ల ప్రేమను, సంతాన భాగ్యమును, ధర్మమును, చిరకీర్తి, యశస్సులను ప్రసాదించ వలసినదిగా శ్రీ షష్ఠీదేవిని ప్రార్థిస్తున్నాను.

08. సురేశ్వరీ! నాకు ధనము నిమ్ము, ప్రియ పత్ని నిమ్ము, పుత్రుణ్ణిమ్ము, ధర్మము నిమ్ము, యశమునిమ్ము షష్ఠీ దేవి నీకు అనేకానేక నమస్కారములు.

09. దేహి భూమిం ప్రజాం దేహి విద్యాం దేహి సుపూజితే।
కళ్యాణం చ జయం దేహి షష్ఠీ దేవ్యై నమో నమః॥

నాకు భూమిని, సంతానమును, జ్ఞానమును, పవిత్రతను, జయమును ప్రసాదించ వలసినదిగా శ్రీ షష్ఠీదేవిని ప్రార్థిస్తున్నాను.

09. మాతా నాకు జయమునిమ్ము. భూమిని ప్రసాదించు. సంతానం నిమ్ము. విద్యని ప్రసాదించు. సుపూజితా! నాకు కల్యాణం, జయము ప్రసాదించు షష్ఠీ దేవసేనా నీకు బహు నమస్కారములు.

ఫలశ్రుతి:

10. ఇతి దేవీం చ సంస్తుత్య లభేత్పుత్రం ప్రియవ్రతం।
యశశ్వినం చ రాజేంద్రం షష్ఠీ దేవి ప్రసాదత॥

ఈ విధముగా శ్రీ షష్ఠీదేవిని భక్తిపూర్వకముగా ప్రార్థించిన వారికి సంతానము, యశస్సు, రాచరికము సంప్రాప్తిస్తాయి.

10. ఈ స్తోత్రం పఠించినందు వల్లే ప్రియవ్రత రాజునకు షష్ఠీదేవి అనుగ్రహమున మరణించిన పుత్రుడు చిరంజీవుడై మహాయశస్వి అయ్యెను.

11. షష్ఠీ స్తోత్రమిదం బ్రహ్మన్ యః శృణోతి తు వత్సరం।
అపుత్రో లభతే పుత్రం వరం సుచిర జీవనం॥

బ్రహ్మాండమైన ఈ శ్రీ షష్ఠీదేవి స్తోత్రాన్ని భక్తి పూర్వకముగా సంవత్సరం పాటు పఠించిన వారికి సంతాన ప్రాప్తి, వరములు, ఆనందకరమైన జీవితం లభిస్తాయి.

11. బ్రహ్మనందనా షష్ఠీ దేవి స్తోత్రం ఒక సంవత్సర పర్యంతం శ్రవణ మొనర్చిన వారి పుత్రులైనచో (సంతానం) వారికి దీర్ఘాయుషు లభించును.

12. వర్షమేకం చ యా భక్త్యా సంస్తుత్యేదం శృణోతి చ।
సర్వపాప వినిర్ముక్తా మహావంధ్యా ప్రసూయతే॥

ఈ స్తోత్రాన్ని భక్తిపూర్వకముగా సంవత్సరం పాటు పఠిస్తే, అన్ని పాపములు తొలగిపోయి, బిడ్డలు లేని స్త్రీ, వీరుడు, సద్గుణవంతుడు, జ్ఞానవంతుడు, దీర్ఘాయుష్మంతుడైన సంతాన భాగ్యాన్ని శ్రీ షష్ఠీదేవి అనుగ్రహిస్తుంది.

12. ఒక సంవత్సర పర్యంతం భక్తితో దేవిని పూజించి ఈ స్తోత్రం పఠించే వారి పాపములన్ని నశించును. మహా వంధ్య అయినను ఈ స్తోత్ర ప్రభావం చేత సంతానవతి కాగలదు.

13. వీరం పుత్రం చ గుణినం విద్యా వన్తం యశస్వినం।
సుచిరాయుష్యవన్తం చ సూతే దేవి ప్రసాదతః॥

వీరుడు, విద్యావంతుడు, యశస్వి, చిరాయువు కలిగిన పుత్రుడు దేవీ ప్రసాదము వలన జన్మిస్తాడు.

13. ఆమె దేవసేనా కృపవలన గుణవంతుడు, విద్యావంతుడు, యశస్వి, చిరంజీవి, శ్రేష్ఠుడు అగు పుత్రునకు తల్లికాగలిగెను.

14. కాక వంధ్యా చ యా నారీ మృతపత్యా చ యా భవేత్।
వర్షం శృత్వా లభేత్పుత్రం షష్ఠీదేవీ ప్రసాదతః॥

ఇంతవరకు బిడ్డలు లేని స్త్రీ, లేదా మృత శిశువులకు జన్మనిచ్చిన స్త్రీ ఈ స్తోత్ర పఠనం వలన సంవత్సర కాలంలో శ్రీ షష్ఠీదేవి ప్రసాదంగా సంతానాన్ని పొందుతుంది.

14. అంతేకాక వంధ్య అయినను, మృతవత్స అయినను ఒక సంవత్సరం పర్యంతం ఈ స్తోత్రం పఠించిన, శ్రవణ మొనర్చిన నిశ్చయముగా సంతానవతి కాగలదు.

15. రోగ యుక్తే చ బాలే చ పితామాతా శృణోతి చేత్।
మాసేన ముచ్యతే రోగాన్ షష్ఠీదేవి ప్రసాదతః॥

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

ఈ స్తోత్రమును ఒక మాసం రోజులు శ్రద్ధతో పారాయణ చేస్తే, పిల్లలకు కలిగే బాలారిష్టాలు, రోగములు నివారింపబడుతాయి.

15. శిశువు రోగగ్రస్తుడైన వాని తల్లి తండ్రులు ఒక మాస పర్యంతం ఈ స్తోత్రం శ్రవణ మొనర్చిన ఆరోగ్యవంతులు కాగలరు.

16. జయదేవి జగన్మాతా(తః) జగదానందకారిణీ।
ప్రసీద మమ కళ్యాణి నమస్తే షష్ఠీ దేవతే॥

జగన్మాతను, ఈ విశ్వమునకు ఆనందకారిణియైన దేవిని నన్ను కరుణించి అనుగ్రహించవలసినదిగా ప్రార్థిస్తున్నాను.

// ఇతి శ్రీ సుబ్రహ్మణ్య వైవృత్త పురాణే, శ్రీ ప్రియావృత రచిత శ్రీ షష్ఠీదేవి స్తోత్రమ్ సంపూర్ణమ్//

– – – = – – –





Kiron Type Institute



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.-944 044 9650, 994 994 1430)